భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు


కోటకొండలో ఈద్గా వద్ద ప్రార్థనలు


రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి

సాక్షి నెట్‌వర్క్ : నారాయణపేట మండలంలోని రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కోటకొండ, కొల్లంపల్లి, జాజాపూర్‌లలో ఈద్గాలకు వెళ్లి ముస్లిం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మక్తల్ పట్టణంలో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి వేడుకల్లో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ చైర్ పర్సన్ వనజ, మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ ,ఎంపీపీ వనజ, రాష్ట్ర పీసీసీ సభ్యుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సురక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పానీయాలను పంపిణీ చేశారు.
కోస్గిలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు పండుగ సందేశాన్ని అందించారు. గుండుమాల్ మండలం, నాచారం, ముశ్రీఫా, తోగాపూర్‌తోపాటు పలు గ్రామాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి.
ధన్వాడ మండలంలో అన్ని గ్రామాల్లో రంజాన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వీధుల్లో ర్యాలీ చేపట్టారు. వివిధ పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.
మరికల్‌లోని అన్ని గ్రామాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
మద్దూర్‌లో రంజాన్ వేడుకల్లో హీమామ్ అబ్దుల్ ఖలీద్, సర్పంచ్ అరుణ, ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీటీసీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.
మాగనూర్‌లోని అన్ని గ్రామాల్లో రంజాన్ సందడి నెలకొంది. వేడుకల్లో సర్పంచ్ రాజు, ముస్లిం మత పెద్దలు మహ్మద్, సుల్తాన్ , చంద్, మహ్మద్‌ఆలీ, కోఆప్షన్ మెంబర్ యాకుబ్‌ఆలీ, మౌలాలి, మాజీ సర్పంచ్ ఆనంద్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీనివాస్, ఆంజనేయులు, రాజు, బస్వారాజు తదితరులు పాల్గొన్నారు.


మద్దూర్‌లో..

ఊట్కూర్‌లో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్ రెడ్డి, నాయకులు ఎల్కోటి నారాయణరెడ్డి, దుర్గం శ్రీనివాస్, గోవిందప్ప, వెంకటేశ్, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు. ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
మండలంలోని నర్వ, లంకాల్, రాంపూర్, రాయికోడ్, పెద్దకడ్మూర్, కల్వాల్ గ్రామాల్లోని ఈద్గాల వద్ద ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా గ్రామాల మసీద్ కమిటీ సభ్యులు బాబు మియ్యా, హమీద్, సాహెబ్‌హుసేన్, ఇమాంసాబ్, మహ్మద్, ఖాజా, ఇతర పెద్దలు పాల్గొన్నారు.


మద్దూర్‌లో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


కొల్లంపల్లి దర్గాలో..


లంకాల్‌లో..


మరికల్‌లో..


మక్తల్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ధన్వాడలో..


మాగనూర్‌లో ..


కోస్గిలో..


ఊట్కూర్‌లో ..

క్లుప్తంగా

గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టాలి

మరికల్: మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న పాత పంచాయతీ భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయానికి అక్కడే కొత్త భవనం నిర్మించి కొనసాగించాలని బీజేపీ మండల నాయకులు వేణు, కొండయ్య అన్నారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. కొంత కాలం నుంచి పాత భవనంలో గ్రంథాలయం కొనసాగడం వల్ల పాఠకులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరారు.

24 నుంచి క్రీడాపోటీలు

మక్తల్: నేషనల్ స్కిప్పింగ్ డేను పురస్కరించుకొని ఈ నెల 24 క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా షూటింగ్‌బాల్, టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు వివరాలను శనివారం షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

నారాయణపేట రూరల్ : మండలంలోని జిలాల్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాంపురం సిద్రాంరెడ్డి (90) శనివారం మృతి చెందారు. 1975 నుంచి 1996 వరకు సుమారు ఇరవై సంవత్సరాల పాటు బైరంకొండ, జిలాల్‌పూర్ ఉమ్మడి గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా ఈయన పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి అనుచరుడిగా ఉంటూ జనతాపార్టీ, కాంగ్రెస్‌లో మంచి నాయకుడిగా ఎదిగారు. సిద్రాంరెడ్డి మృతికి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కుంభం శివకుమార్‌రెడ్డి, నాగురావునామాజీ, రతంగపాండురెడ్డి, అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

వేడుకలకు సర్వం సిద్ధం

నారాయణపేట రూరల్ : బసవజయంతి, అక్షయ తృతీయ వేడుకలకు పట్టణం సిద్ధమైంది. స్థానిక సరాఫ్‌బజార్‌లోని బసవేశ్వర ఆలయాన్ని నిర్వాహకులు ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి మహాభిషేకం, బిల్వార్చన, మహామంగళహారతి, అలంకరణ, అష్టోత్తర నామావళి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బుస్సయ్యస్వామి తెలిపారు. అదేవిధంగా పతాకావిష్కరణ, డోలారోహణం, కాడెద్దుల ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు. ఇక అదేవిధంగా సరాఫ్‌బజార్‌లో బంగారు, వెండి వర్తకులు సైతం వివిధ డిజైన్లతో ఆభరణాలు సిద్ధం చేశారు. వేడుకల సందర్భంగా పట్టణంలో పెద్ద ఎత్తున బంగారం, వెండి కొనుగోళ్లు జరగనున్నాయి.

మక్తల్‌లో ఫ్యామిలీ కౌన్సెలింగ్

మక్తల్: భేదాభిప్రాయాలను తొలగించుకుని, ప్రతి ఒక్కరూ కుటుంబంతో కలిసి జీవించాలని సీఐ సీతయ్య అన్నారు. మక్తల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం పలువురికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. మక్తల్ సర్కిల్ పరిధిలో 3 కేసులు ఉండగా పరిష్కారం అయ్యాయని వివరించారు. మక్తల్, మాగనూర్, ఊట్కూర్, కృష్ణ, మండలాలకు చెందిన వారు ఫ్యామిలీ కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీ మహిళా సంఘం గ్రూపు లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

కోస్గి: పాత కక్ష్యల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చెన్నారం గ్రామానికి చెందిన జోగు మొగులప్ప గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలానికి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన వెంకటయ్య, సత్యనారాయణ, కావలి వెంకటయ్య మూకుమ్మడిగా దాడి చేశారు. సిమెంట్ రాయితో దాడి చేయడంతో మొగులప్పకు తీవ్రంగా గాయాలై, రక్తస్రావం జరిగింది. ఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

రైస్‌మిల్లు పొట్టుతో తంటాలు

మాగనూర్: మండలంలోని వడ్వాట్‌కు వెళ్లే దారిలో ఉన్న ఓ రైస్‌మిల్లు నుంచి వస్తున్న పొట్టుతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్వాట్, అడవిసత్యారం, కొల్పూర్, మందిపల్లి, అమ్మపల్లి తదితర గ్రామాలకు వెళ్లే ఈ ప్రధాన రహదారిపై మిల్లు నుంచి వస్తున్న పొట్టు పడుతోందని, అదికాస్తా కళ్లలో పడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, ప్రమాదాలు జరుగుతున్నాయని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. మిల్లు యాజమానికి చెప్పినా పట్టించుకోవడం లేదని సంబధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయండి


సమీక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు

కోస్గి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 25న బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ఐటీ మంత్రి కేటీఆర్ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం రూ. లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపడుతున్న నిరుద్యోగ మార్చ్‌కు పెద్ద ఎత్తున నిరుద్యోగులు తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ నర్సిములు, కో కన్వీనర్ కోటకొండ రాము, జిల్లా ఉపాధ్యాక్షుడు మదన్, నాయకులు కూర వెంకటయ్య, చెంద్రప్ప, బాబయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన గుండుమాల్ నాయకులు

కోస్గి: గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన పలు పార్టీల నాయకులు శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. గ్రామానికి చెందిన రాజు, కవిత, మోహన్ చారీ, జైపాల్ నాయక్‌తోపాటు పలువురు బీజేపీలో చేరగా జిల్లా అధ్యక్షుడు వారికి పార్టీ కండువాలతో సన్మానం చేశారు. పార్టీలో చేరిన వారిని పార్టీ రాష్ట్ర నాయకులు నాగురావ్ నామాజీ అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ రాము, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

ధన్వాడ: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరుద్యోగ మార్చ్ పోరుబాట పోస్టర్‌ను విడుదల చేశారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో జిల్లా నాయకులు రతంగ్‌పాండురెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మాకంసురేందర్, ఉదయభాను, గోవర్ధన్‌గౌడ్ ఉన్నారు.

చెవిలో పూలతో నిరసన


మాగనూర్ చెవిలో పూలు పెట్టుకుని సమ్మెలో పాల్గొన్న వీఓఏలు

మక్తల్: పట్టణంలో వీఓఏ నిరసన కొనసాగుతోంది. శనివారం ఆరోరోజు నిర్వహించిన సమ్మెలో జ్యోతి, చంద్రకళ, వెంకట్‌రాములు, బాలయ్య, రాంరెడ్డి, రాజు, రాము, సంతోష, శమంతకమణి, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
మాగనూర్: వీఓఏలు సమ్మె మండలంలో కొనసాగుతోంది. ఆరోరోజు వీఓఏలు చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు పూంజనూర్ బాబు 20 ఏళ్లుగా మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పడుతున్న తమకు న్యాయం చేయాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు అందించి ఆదుకోవాలని కోరారు. మండల కార్యదర్శి విష్ణు, కోశాధికారి రఘు, మారుతి, వరలక్ష్మి, మహేశ్వరమ్మ, రవి, వెంకటమ్మ, భాగ్యమ్మ, పావని, కరెప్ప , అనసూయ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మంచినీటి ట్యాంకు

ఊట్కూర్: మండలం కేంద్రంలోని గాంధీనగర్‌లో రక్షిత మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. 30 ఏళ్ల క్రితం ఒక లక్ష లీటర్ల సామర్థ్యం గల ఈ ట్యాంకు నిర్మించారు. కాగా ప్రస్తుతం ట్యాంకు శిథిలావస్థకు చేరి సిమెంట్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. లీకేజీలు ఏర్పడ్డాయి. పిల్లర్లకు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు తేలాయి. ట్యాంకు శిథిలావస్థకు చేరిన విషయం సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ట్యాంకు కూలిపోయే ప్రమాదముందని అధికారులు స్పందించి ట్యాంకు మరమ్మ చేపట్టాలని కోరుతున్నారు. విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్‌కు వివరణ కోరగా వారం రోజుల్లో ట్యాంకుకు నీటి సరఫరాను నిలిపివేసి సమీపంలో నూతనంగా నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంకుకు నీటి సరఫరా కనెక్షన్ ఇస్తామని తెలిపారు.


చువ్వలు తేలిన మంచినీటి ట్యాంకు

ఒంటికి నిప్పు పెట్టారని ఫిర్యాదు

మరికల్: కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తన ఒంటికి నిప్పు పెట్టడంతో గాయపడ్డానని ఓ వ్యక్తి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని జిన్నారంనకు చెందిన కృష్ణయ్య గ్రామంలో టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు తన హోటల్‌లో టిఫిన్ చేసి డబ్బులు అడిగితే ఇవ్వకుండా ఈ నెల 21 రాత్రి సమయంలో ఆరుబయట నిద్రిస్తున్న తనను బెదిరించి నిప్పు పెట్టి వెళ్లారని పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు శనివారం అతడు ఫిర్యాదు చేయగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. అనుమానితులను విచారించిన తర్వాత ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బాధితుడిని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించామని వివరించాడు.

భవన నిర్మాణానికి భూమి పూజ

మాగనూర్: మండలంలోని బైరంపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శనివారం స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి టెంకాయ కొట్టి భూమి పూజ చేశారు. రూ. 22 లక్షలతో నూతన భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాడని కొనియాడారు. అంతకుముందు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే విధంగా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు సహకరించిన గ్రామస్తులను ఆయన అభినందించి సన్మానించారు. మండల స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా బైరంపల్లి ఎంపిక కావడంపై అభినందనలు తెలియజేశారు. త్వరలోనే రూ. 65 లక్షలతో కల్వర్టుల నిర్మాణం ప్రారంభిస్తామని పూర్తయిన వెంటనే బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతామని అన్నారు. సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, నెరడగం సర్పంచ్ అశోక్‌గౌడ్, శేఖర్, నాయకులు రాఘవేంద్ర, నవీన్, రాఘవేంద్రగౌడ్, ఈశ్‌యాదవ్, నేతాజీ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్ : వేసవి సెలవుల్లో ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ రవిబాబు కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ... పిల్లల పరీక్షలు ముగిసిన వెంటనే విహారయాత్రలు, బంధువుల ఇళ్లకు, టూర్లు తదితర కార్యక్రమాలకు వెళ్లే వారు విలువైన బంగారం, వెండి ఆభరణాలు, డబ్బులను బ్యాంకు లాకర్లలో దాచుకోవాలన్నారు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ అలారం ఏర్పాటు చేసుకుంటే ఎంతో మంచిదని, ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ అమర్చుకోవాలన్నారు. ఎక్కువ రోజులు వెళ్లాల్సి వస్తే సమాచారం దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. ఇక కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు, కొత్తవారు సంచరిస్తే డయల్ పీఎస్‌కు తెలియజేయాలన్నారు. ద్విచక్రవాహనాలు చైన్‌తో లాక్ చేసుకోవాలని, నమ్మకమైన వాచ్‌మెన్‌ను మాత్రమే ఉంచుకోవాలని ఆయన సూచించారు.

బసవజయంతి ఘనంగా నిర్వహిద్దాం


ఎస్పీ వెంకటేశ్వర్లుకు ఆహ్వాన పత్రం అందిస్తున్న ఆలయ నిర్వాహకులు

నారాయణపేట రూరల్ : బసవేశ్వర జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించుకుందామని బసవేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు బుస్సయ్యస్వామి పిలుపునిచ్చారు. శనివారం ఆలయ ప్రాంగణంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. బసవ జయంతి నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లును కలుసుకుని ఆహ్వానపత్రంతో పాటు బసవ జయంతి ఉత్సవాలను కార్యాలయంతో పాటు అన్ని పీఎస్‌లలో నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పట్టణంలోని బసవ భక్తులు, వీరశైవ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలింగం, జయప్రకాష్, జగదీష్, శివకుమార్, జాజాపూర్‌రవి, సంగన్‌బస్సప్ప పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉత్సవాలు



ధన్వాడ: మండలంలోని గున్ముక్లలో వెలసిన స్వయం భు కడపరాయ దేవస్థాన ముఖద్వార ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీసేవ, అడుగుల భజన నిర్వహించారు. గ్రామానికి చెందిన చెన్నప్పగారి హన్మిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు హన్మిరెడ్డి, రఘోత్తంరెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి వారికి వస్తున్న రైతుబంధు డబ్బులకు మరికొన్ని జత చేసి ముఖద్వారం నిర్మింపజేశారు. అదేవిధంగా పొలిమేర నుంచి గ్రామం వరకు విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. కాగా ఆదివారం ముఖద్వారాన్ని ప్రారంభించనున్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు ఎస్.రాజేందర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తదితరులు రానున్నట్లు నిర్వాహకులు వివరించారు.

బీటీ రహదారి పనుల ప్రారంభమెప్పుడు..?

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ నుంచి బెక్కర్‌పల్లి వరకు మంజూరైన బీటీ రహదారి పనులు కాంట్రాక్టర్ ప్రారంభించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం ఈ రహదారి గుండా అమరచింత, ఆత్మకూర్‌కు ఆయా గ్రామాల నుంచి ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో రహదారి పూర్తిగా దెబ్బతిని ఎక్కడికక్కడ గుంతలమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మక్తల్ నుంచి ఆత్మకూర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ప్రైవేట్ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

డొక్కు బస్సులు ఇంకెన్నాళ్లు ?


బస్సును నెట్టుతున్న సిబ్బంది, ప్రయాణికులు

మక్తల్: మండలంలో ఆర్టీసీ బస్సుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఇటు ప్రయాణికులకు, అటు డ్రైవర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. నిర్వహణ సరిగా లేకపోవడంతో బస్సులు ఎక్కడపడితే అక్కడ ఆగిపోతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రతిగ్రామానికి ఆర్టీసీ నుంచి ఉత్తమ సేవలు అందిస్తామని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో కొందరి నిర్లక్ష్యంతో అమలు కావడం లేదని పలువురు వాపోతున్నారు. శనివారం సైతం మక్తల్ బస్టాండ్‌లో ఓ బస్సును స్టార్ట్ చేయడం కోసం ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు వెనుకనుంచి నెట్టడం సాక్షి కెమెరాకు చిక్కింది.